

# ప్రజాస్ఫూర్తి


PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 21-01-2026 | సంపుటి - 26 | సంచిక -242 | రూ : 4 | పేజీలు: 8

ఫ్యూచర్ సిటీ కోసం తెలంగాణ ప్రభుత్వంతో

## చేతులు కలిపిన యూఏఈ

- రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందాన్ని కలిసిన యూఏఈ మంత్రి

2లో



సంప్రదాయబద్ధంగా

## శబరిమల ఆలయం మూసివేత


- మండల-మకరవిళక్కు సీజన్ ముగియడంతో శబరిమల ఆలయం మూసివేత
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు.. విజయవంతంగా ముగిసిన యాత్ర
- పందలం రాజవంశీయులకు తాళాలు అప్పగించి సన్నిధికి తాళం
- ఫిబ్రవరి 12న నెలవారీ పూజల కోసం మళ్లీ తెరవనున్న ఆలయం



2లో

సిట్ నన్ను అడగడం కాదు..

## నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా



2లో

- ఏడు గంటల విచారణ అనంతరం హరీశ్ రావు
- దమ్ముంటే ఈరోజు విచారణకు సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని సవాల్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకేం సంబంధమని ప్రశ్న
- అప్పుడు నేను హోంమంత్రిగా పని చేశానా అని నిలదీత

బలవంతంగా ట్రాఫిక్ చలాన్లు


## వసూలు చేయవద్దు

### హైకోర్టు కీలక ఆదేశాలు

- వాహనం లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదన్న హైకోర్టు
- వాహనదారుడు చెల్లిస్తేనే చలానా మొత్తం తీసుకోవాలన్న హైకోర్టు
- వాహనదారుడికి చెల్లించడం ఇష్టంలేకపోతే నోటీసులు జారీ చేయాలన్న హైకోర్టు

2లో








2లో

స్కిల్స్ ఉన్నాయి.. కానీ సంతృప్తి లేదు..

## భారత ఉద్యోగులపై సర్వేలో కీలక విషయాలు!

- భారత ఉద్యోగుల్లో 95 శాతం మందికి నైపుణ్యాలపై పూర్తి నమ్మకం
- ఉద్యోగంలో సంతృప్తిగా ఉన్నది కేవలం 64 శాతం మంది మాత్రమే
- సగానికి పైగా ఉద్యోగుల్లో తీవ్ర ఒత్తిడి, పనిభారంతో బర్న్అవుట్
- ఉద్యోగుల సంక్షేమంపై కంపెనీలు దృష్టి పెట్టాలని నిపుణుల సూచన

దావోస్‌లో ఐబీఎం చైర్మన్ తో

## సీఎం కీలక సమావేశం

- అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన
- క్వాంటం టెక్నాలజీలో ఏపీకి అగ్రస్థానం కల్పించాలని విజ్ఞప్తి
- 10 లక్షల మంది ఏపీ యువతకు ఏఐలో శిక్షణ ఇవ్వాలని కోరిన లోకేశ్
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ఐబీఎం




2లో



2లో

ఇకపై నితిన్ నబినే నా బాస్..

## నేను కార్యకర్తను మాత్రమే

- బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్
- పార్టీ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన జాతీయ అధ్యక్షుడిగా గుర్తింపు
- నూతన అధ్యక్షుడిని అభినందించిన మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్
- వికసిత భారత్ లక్ష్య సాధనలో నబిన్ నాయకత్వం కీలకమన్న ప్రధాని

# ఫ్యూచర్ సిటీ కోసం తెలంగాణ ప్రభుత్వంతో చేతులు కలిపిన యూఏఈ

హైదరాబాద్ : భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణతో భాగస్వామ్యం కుదుర్చుకోనున్నట్లు తెలిపింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్ బిన్ తౌక్ అల్ మర్రీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందాన్ని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మర్రీ మాట్లాడుతూ, తెలంగాణతో కలిసి పనిచేయడానికి సంతోషంగా ఉన్నామని అన్నారు. ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకువెళ్లడానికి రెండు ప్రభుత్వాలు అధికారులతో ఒక ఉమ్మడి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతినిధి బృందం భారత్ ఫ్యూచర్ సిటీలో సహకారానికి గల అవకాశాలపై చర్చించింది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను యూఏఈ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపడమే తమ లక్ష్యమని తెలిపారు. దేశంలోనే తొలి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా 30,000 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. విద్య, ఆరోగ్యం, ఏఐ, పరిశ్రమలు, నివాసాలు, వినోద రంగాలకు ప్రత్యేక జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మారుబేని, సెమ్‌కార్ప్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు ఇప్పటికే ఈ ప్రాజెక్టు కోసం చేతులు కలిపాయని అన్నారు. ఫ్యూచర్ సిటీలో జూను స్థాపించడం కోసం రిలయన్స్ గ్రూప్ వంతారాతో అవగాహన ఒప్పందం కుదిరిందని ముఖ్యమంత్రి వివరించారు.

## ఆ కంపెనీని కొనమంటారా, వద్దంటారా... ఎక్స్ యూజర్లను అభిప్రాయం అడిగిన ఎలాన్ మస్క్

టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తన సోషల్ మీడియా పోస్ట్‌తో సంచలనం సృష్టించారు. యూరప్‌కు చెందిన అతిపెద్ద బడ్జెట్ ఎయిర్‌లైన్ 'ర్యాన్‌ఎయిర్'ను కొనుగోలు చేయమంటారా? అంటూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోల్ ప్రారంభించారు. ర్యాన్‌ఎయిర్ సీఈఓ మైఖేల్ ఓ'లియరీతో జరిగిన తీవ్ర వాగ్వాదం తర్వాత ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ర్యాన్‌ఎయిర్ విమానాల్లో స్టార్‌లింక్ సేవలను ఇన్‌ఫ్లైట్ వైఫైగా ఉపయోగించడంపై మొదలైన వ్యాపార విభేదం వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది. తమ వ్యాపారానికి స్టార్‌లింక్ ఖర్చులు సరిపడవని ర్యాన్‌ఎయిర్ ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ర్యాన్‌ఎయిర్ సీఈఓ ఓ'లియరీ.. మస్క్‌ను "ఒక ఇడియట్" అని, అతడిని ఎవరూ పట్టించుకోవద్దని వ్యాఖ్యానించారు. దీనిపై మస్క్ ఘాటుగా స్పందిస్తూ ఓ'లియరీ "అట్టర్ ఇడియట్" అని, "అతడిని ఉద్యోగంలో నుంచి తీసేయండి" అని పోస్ట్ చేశారు. ఈ మాటల యుద్ధం నేపథ్యంలోనే మస్క్.. ర్యాన్‌ఎయిర్‌ను కొనుగోలు చేయాలా వద్దా అని పోల్ నిర్వహించారు. కొద్ది గంటల్లోనే ఈ పోల్‌కు 7,50,000కు పైగా ఓట్లు రాగా, 76.8 శాతం మంది కొనుగోలుకు మద్దతు తెలిపారు. తనదైన శైలిలో స్పందించిన మస్క్, "ర్యాన్‌ఎయిర్‌ను 'ర్యాన్' అనే వ్యక్తి నడపాలి, అతడిని అసలైన పాలకుడిగా చేయడం మీ విధి" అంటూ చమత్కరించారు. అయితే, ఇది కేవలం సరదా పోలా లేక నిజంగానే టేకోవర్ చేసే ఉద్దేశం ఉందా అనే దానిపై మస్క్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## సిట్ నన్ను అడగడం కాదు.. నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తనను ప్రశ్నించడం కాదని, తానే సిట్‌కు వంద ప్రశ్నలు వేశానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. దమ్ముంటే ఈరోజు విచారణకు సంబంధించిన వీడియోలను విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను హోంమంత్రిగా ఎప్పుడైనా పని చేశానా అని వ్యాఖ్యానించారు. నాటి డీజీపీ, చీఫ్ ఇంటెలిజెన్స్‌ను కూడా విచారణకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు దాదాపు ఏడు గంటల పాటు విచారించారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నోటీసులు, విచారణలు బీఆర్ఎస్‌ను భయపెట్టలేవని ఆయన అన్నారు. రేపు ప్రజా కోర్టులో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల గురించి మంత్రులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అరెస్టులు తమకు కొత్తేమీ కాదని ఆయన అన్నారు. ముగ్గురు అధికారులతో కూడిన సిట్ దర్యాప్తు బృందం తనను ప్రశ్నించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయతీపరుడైతే ఈ అంశంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపందలా పోలీసులను వెనుకబెట్టుకుని కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, సిట్ అధికారులు ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని ఆయన అన్నారు. వారి కుంభకోణాలు, చీకటి రాజకీయాలను బయటపెడుతున్నామని తమపై కేసులు పెడుతున్నారని హరీశ్ ఆరోపించారు. మీ దోపిడీలను ప్రశ్నిస్తున్నామని, మాపై కేసులు పెడతారా అని నిలదీశారు. తమపై అన్నీ నిరాధార ఆరోపణలేనని, సొల్లు పురాణాలేనని విమర్శించారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష వింటేనే రోత పుడుతోందని అన్నారు. రేవంత్ రెడ్డిలా తమకు వెన్నుపోట్లు తెలియవని, పోరాటాలు మాత్రమే తెలుసని ఆయన అన్నారు. కేసీఆర్ తమకు నేర్పింది పోరాటమే అన్నారు. ఇప్పుడు తనకు సిట్ ద్వారా వచ్చిన నోటీసులు మీ పతనానికి నాంది అని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ధైర్యం ఉంటే తమను రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు. మీ చిల్లర, బురద, కుట్ర, కుతంత్రాల రాజకీయాలు ఇక నడవవని అన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు విస్మరించారని ఆరోపించారు.

## దావోస్‌లో ఐబీఎం చైర్మన్ తో సీఎం చంద్రబాబు కీలక సమావేశం

దావోస్, జనవరి 20: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రపంచ ప్రఖ్యాత టెక్ సంస్థ ఐబీఎం చైర్మన్, సీఈవో అరవింద్ కృష్ణతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్, ప్రత్యేకించి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు ఐబీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు పూర్తి సహకారం అందించాలని వారు ఐబీఎంను కోరారు. ఈ భేటీ ఫలప్రదంగా జరిగిందని, రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఇదే భేటీలో యువతకు కృత్రిమ మేధలో శిక్షణ ఇచ్చే అంశంపైనా చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎం సిద్ధంగా ఉందని అరవింద్ కృష్ణ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 10 లక్షల మంది యువతకు అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో భాగంగా చంద్రబాబు, లోకేశ్ బృందం టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు వరుస భేటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐబీఎంతో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## బలవంతంగా ట్రాఫిక్ చలాన్లు వసూలు చేయవద్దు


తెలంగాణ : తెలంగాణ హైకోర్టు వాహనాల పెండింగ్ చలాన్‌లపై కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్‌ల విషయంలో వాహనదారులను బలవంత పెట్టవద్దని ట్రాఫిక్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా చలాన్‌లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. పెండింగ్ చలాన్‌ల వసూలు కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు ఈ ఆదేశాలు జారీ చేసింది. చలాన్‌లు చెల్లించాలని వాహనాల తాళాలు లాక్కోవడం, వాహనాన్ని ఆపడం వంటి చర్యలకు పాల్పడవద్దని ట్రాఫిక్ పోలీసులకు సూచించింది. వాహనం ఆపినప్పుడు వాహనదారు స్వచ్ఛందంగా చలాన్‌లు చెల్లిస్తే పోలీసులు వసూలు చేయవచ్చని పేర్కొంది. వాహనదారులు చలానా చెల్లించడానికి ఇష్టపడకుంటే చట్ట ప్రకారం వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది.

## స్కిల్స్ ఉన్నాయి.. కానీ సంతృప్తి లేదు..

ఢిల్లీ : భారత్‌లోని ఉద్యోగుల్లో ఓ ఆసక్తికరమైన వైరుధ్యం కనిపిస్తోంది. దాదాపు 95 శాతం మంది తమ నైపుణ్యాలపై పూర్తి విశ్వాసంతో ఉన్నప్పటికీ, కేవలం 64 శాతం మంది మాత్రమే తమ ఉద్యోగంతో సంతృప్తిగా ఉన్నట్లు మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఇవాళ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1,000 మందికి పైగా ఉద్యోగుల నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించారు. నివేదిక ప్రకారం తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించగలమనే నమ్మకం 95 శాతం మందిలో ఉంది. కెరీర్ డెవలప్‌మెంట్ అవకాశాలు ఉన్నాయని 90 శాతం, ప్రమోషన్లు వస్తాయని 84 శాతం, ఏఐ (AI) టెక్నాలజీని వాడటంలో నమ్మకంగా ఉన్నామని 90 శాతం మంది తెలిపారు. అయితే, ఈ ఆత్మవిశ్వాసం వారిలో ఉద్యోగ సంతృప్తిని పెంచడం లేదని నివేదిక స్పష్టం చేసింది. సుమారు 53 శాతం మంది రోజూ తీవ్రమైన లేదా ఒక మోస్తరు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తేలింది. మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా, మిడిల్ ఈస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ గులాటి మాట్లాడుతూ.. "అధిక పనిభారం, ఎక్కువ పని గంటల కారణంగా 75 శాతం మంది బర్న్‌అవుట్‌కు గురవుతున్నారు. చాలామంది కొత్త అవకాశాల కోసం చూస్తున్నప్పటికీ, దాదాపు సగం మంది భద్రత కోసం ఉన్న ఉద్యోగాన్నే అంటిపెట్టుకుని ఉంటున్నారు" అని వివరించారు.

బ్లూకాలర్ వర్కర్లలో (68 శాతం) శ్రేయస్సు తక్కువగా ఉండగా, జెన్‌జెడ్ మహిళలు (64 శాతం) అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వైట్ కాలర్, సీనియర్ మేనేజర్లు తమ పనిలో సంతృప్తి పొందుతున్నప్పటికీ, వారే అత్యంత ఒత్తిడికి గురవుతున్న గ్రూపులుగా ఉన్నారని తేలింది. రంగాల వారీగా చూస్తే, ఎనర్జీ, యుటిలిటీస్ రంగంలో ఉద్యోగుల శ్రేయస్సు (72 శాతం) అత్యల్పంగా ఉంది. హెల్త్‌కేర్ (52 శాతం), ఫైనాన్షియల్స్ (50 శాతం) రంగాల వారు ఉద్యోగ భద్రతపై తక్కువ నమ్మకంతో ఉన్నారు. కేవలం నైపుణ్యాలపై విశ్వాసం ఉంటే సరిపోదని, ఉద్యోగులను నిలుపుకోవాలంటే కంపెనీలు స్పష్టమైన కెరీర్ మార్గాలు, మేనేజర్లపై నమ్మకం, ఉద్యోగుల సంక్షేమంపై పెట్టుబడి పెట్టాలని సందీప్ గులాటి సూచించారు.





## సంప్రదాయబద్ధంగా శబరిమల ఆలయం మూసివేత

కేరళ : కేరళలోని ప్రఖ్యాత శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు నెలలకు పైగా సాగిన మండల-మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర మంగళవారం ఉదయంతో ముగిసింది. సంప్రదాయబద్ధమైన పూజల అనంతరం ఉదయం 6:45 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) ప్రకటించింది. ఆనవాయితీ ప్రకారం పందలం రాజకుటుంబ ప్రతినిధి పునర్తం నాళ్ నారాయణ వర్మ చివరి దర్శనం చేసుకున్న తర్వాత ఆలయాన్ని మూసివేశారు. అంతకుముందు ఉదయం 5 గంటలకు గణపతి హోమంతో నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. ప్రధాన పూజారి (మేల్శాంతి) ఈడీ ప్రసాద్ నంబూద్రి, అయ్యప్ప స్వామి విగ్రహానికి విభూతి అభిషేకం నిర్వహించి, రుద్రాక్ష మాలతో అలంకరించారు. అనంతరం పవిత్రమైన 'హరివరాసనం' గానం తర్వాత గర్భగుడి తలుపులను మూసివేశారు. ఆలయ తాళపు చెవులను రాజకుటుంబ ప్రతినిధికి అప్పగించగా, ఆయన వాటిని శబరిమల పరిపాలనా అధికారి ఎస్. శ్రీనివాసన్‌కు అందజేశారు. నెలవారీ ఖర్చుల కోసం ఉంచే డబ్బుల సంచిని కూడా ఇదే సమయంలో అప్పగించడం ఇక్కడి సంప్రదాయం. ఇదే సమయంలో పవిత్ర తిరువాభరణాల తిరుగు ప్రయాణం కూడా మొదలైంది. 30 మంది సభ్యుల బృందం ఈ ఆభరణాలను తిరిగి పందలం ప్యాలెస్‌కు తీసుకువెళ్తోంది. ఈ బృందం ఈ నెల 23న పందలం చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది మండలమకరవిళక్కు సీజన్ చాలా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిందని టీడీబీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యాత్ర పూర్తయిందని తెలిపారు. పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

### మళ్లీ తెరిచేది ఎప్పుడంటే?

తాజాగా ఆలయాన్ని మూసివేసినప్పటికీ, నెలవారీ పూజల కోసం ఫిబ్రవరిలో మళ్లీ తెరవనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు కుంభం మాసపు పూజల కోసం ఆలయాన్ని తెరిచి, ఫిబ్రవరి 17వ తేదీ రాత్రి 10 గంటలకు తిరిగి మూసివేస్తారు. ఈ సమయంలో భక్తులు దర్శనానికి రావొచ్చని టీడీబీ స్పష్టం చేసింది.

## ఇకపై నితిన్ నబినే నా బాస్.. నేను కార్యకర్తను మాత్రమే

బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ (46) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో ఈ పదవిని చేపట్టిన నేతగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. "ఇకపై పార్టీ వ్యవహారాల్లో నితిన్ నబిన్ నా బాస్, నేను ఒక సాధారణ కార్యకర్తను మాత్రమే" అని మోదీ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'సంఘటన్ పర్వ్' కార్యక్రమంలో నితిన్ నబిన్ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా.. నూతన అధ్యక్షుడిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పార్టీ రాజ్యాంగానికి అనుగుణంగా ప్రజాస్వామ్యబద్ధంగా సంస్థాగత ఎన్నికలు జరిగాయని తెలిపారు. "ప్రభుత్వ అధినేతగా నాకు ఎంత అనుభవం ఉన్నా, అన్నింటికంటే ముందు నేను బీజేపీ కార్యకర్తను. ఈ విషయంలో గర్వపడతాను" అని మోదీ అన్నారు. "వికసిత భారత్ నిర్మాణానికి రానున్న 25 ఏళ్లు చాలా కీలకం. ఈ ముఖ్యమైన సమయంలో నితిన్ నబిన్ పార్టీని ముందుకు నడిపిస్తారు. ఆయన ఒక మిలీనియల్ (జనరేషన్ వై... జెన్ జెడ్ కు ముందు తరం), యువ శక్తితో పాటు సంస్థాగత అనుభవం కూడా ఉంది" అని ప్రధాని ప్రశంసించారు. అటల్ జీ, అద్వానీజీ నుంచి జేపీ నడ్డా వరకు పార్టీ అధ్యక్షులుగా చేసిన సేవలను మోదీ గుర్తు చేసుకున్నారు. నాయకులు మారినా పార్టీ సిద్ధాంతాలు, దిశ మారవని స్పష్టం చేశారు. అనంతరం మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన యువకుడైన నితిన్ నబిన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం చరిత్రాత్మకమని అన్నారు. పార్టీకి మార్గనిర్దేశం చేసిన ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేవలం ఒక్కరే నామినేషన్ వేయడంతో బీజేపీ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎలక్టోరల్ కాలేజ్ నితిన్ నబిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

## దావోస్‌లో ట్రంప్ విందు.. భారత కంపెనీల సీఈవోలకు ఆహ్వానం

దావోస్, జనవరి 20: దావోస్ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేయనున్న ప్రత్యేక విందుకు ఏడుగురు భారతీయ సీఈఓలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు తరలి వస్తున్నారు. ఆరేళ్ల తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సులో పాల్గొననుండటం విశేషం. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొనడం ఇది మూడోసారి. ట్రంప్ ఏర్పాటు చేయనున్న ఈ విందుకు టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిట్టల్, విప్రో సీఈఓ శ్రీని పల్లియా, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, బజాజ్ ఫిన్ సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్, మహీంద్రా గ్రూపు సీఈఓ అనీశ్ షా, జుబిలెంట్ భర్తియా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు హరి భర్తియాలు హాజరయ్యే అవకాశం ఉంది. ప్రపంచ ఆర్థిక సదస్సుకు 130 దేశాల నుంచి 3 వేలకు పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు.



## విద్యార్థులకు పండ్ల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని జడ్పిహెచఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ 5వ వార్డు మెంబర్ తాళ్లపల్లి మమత రాజు గౌడ్, 6వ వార్డు మెంబర్ బండి శ్రీను పండ్లు, బిస్కెట్లను మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులు కష్ట పడి చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులున్నారు.

## కొత్తగూడెం మండలంలో సీఎం కప్–2025 క్రీడలకు సన్నాహాలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : సీఎం కప్-2025 మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి సన్నాహక సమావేశం బుధవారం కొత్తగూడెం మండల వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాశాఖాధికారిణి బి. మధురవాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 29న బాలికలకు, 30న బాలురకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, అలాగే మండల పరిధిలోని బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని కోరారు. ఇప్పటివరకు 150 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇంకా రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో విభాగాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలు ప్రగతి మైదానంలో జరుగుతాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా తమ వెంట రిజిస్ట్రేషన్ కాపీ తీసుకుని రావాలని సూచించారు. ఈ సన్నాహక సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని, పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

## సీనియర్ ఫోటో జర్నలిస్ట్ విద్యాసాగర్ హఠాన్మరణం బాధాకరం



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : సీనియర్ ఫోటో జర్నలిస్ట్ విద్యాసాగర్ హఠాన్మరణం చాలా బాధాకరమని టీయూడబ్ల్యుజే (ఐజేయు) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు శేఖర్ లు అన్నారు. మంగళవారం సూరారంలోని విద్యాసాగర్ నివాసంలో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. విద్యాసాగర్ ఆత్మకు శాంతి చేకూరాలని వారు భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం శేఖర్ 10000 వేలు, బాల్‌రాజ్ 3 వేలు, బౌరంపేట్ మాజి కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి 10000 వేల ఆర్థిక సహాయాన్ని అందచేసారు. ఆయనకు నివాళ్ళులర్పించిన వారిలో కుత్బుల్లాపూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, సీనియర్ జర్నలిస్టులు రాజు యాదవ్, సంతోష్ యాదవ్ లు ఉన్నారు.

# మహిళా సంఘాలను ప్రోత్సహించిన ఘనత వైయస్ఆర్ దే...

- **మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రజాప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
- **మహిళా సంఘాలకు రూ.74.26 లక్షల వడ్డీలేని రుణాలు**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



అందోలు,ప్రజాస్ఫూర్తి : మొదటిసారిగా మహిళా సంఘాలను ప్రోత్సహించిన ఘనత వైయస్ఆర్ దేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం జోగిపేట పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాల చెక్కులు, అలాగే ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళా సంఘాల ద్వారా గ్రామీణ, పట్టణ స్థాయిలో ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు కుటుంబాలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాలకు మొత్తం రూ.74.26 లక్షల వడ్డీలేని రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేసారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాల్లో ముందడుగు వేయాలని సూచించారు. మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకం కింద మొత్తం 6,584 మంది మహిళా సభ్యులకు ఇందిరమ్మ చీరలను మంత్రి పంపిణీ చేసారు. పేద మహిళలకు గౌరవం, భరోసా కల్పించడమే ఇందిరమ్మ పథకం లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువస్తున్నాయని, భవిష్యత్తులో కూడా మహిళల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఆందోల్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాట్లు అయితే స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి అన్నారు.

*** పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్ళు**

పార్టీలకతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలనే ఉద్దేశంతో ఆందోల్ లో ఐదు ఎకరాల భూమిని ప్లాటుగా విభజించి పంపిణీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. అలాగే మహిళలకు నాణ్యతతో కూడిన చీరల పంపిణీ, సన్న బియ్యం సరఫరా, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**మహిళా సంఘాలకు భవనాలు**

జోగిపేట మున్సిపాలిటీ ఫరిదిలో మూడు దిక్కుల 3 భవనాలను నిర్మించేందుకు గాను రూ.4.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అన్ని సదుపాయాలతో నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య,అడిషనల్ కలెక్టర్ పాండు,మున్సిపల్ కమిషనర్ రవీందర్, మెప్మా పీడీ రామాచారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, తహసిల్దార్ మధుకర్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు



## ప్రణాళికబద్ధంగా రంజాన్‌కు అన్ని వసతులు

*** అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ - రంజాన్ ఏర్పాట్లపై సమీక్ష**

ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : ప్రణాళికబద్ధంగా రంజాన్‌కు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం రంజాన పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసులతో జిల్లాలోని అన్ని మసీద్ కమిటీల అధ్యక్షులు, మైనార్టీ సంఘం ప్రతినిధులతో జరిగిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రంజాన్ సందర్భంగా జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని మసీద్ లు, ఈద్గాల వద్ద ప్రతి రోజు తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, నిత్యం పారిశుధ్య పనులు చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని మున్సిపల్, గ్రామపంచాయతీ, సెస్ అధికారులను ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖా ఆద్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆర్ అండ్ బీ, పంచాయత్ రాజ్ శాఖ అధికారులు కావాల్సిన మరమ్మతు, అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ ఆద్వర్యంలో రేషన్ సరుకులు, సిలిండర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ కోసం ముందస్తుగా సమావేశం నిర్వహించిన అధికారులకు మైనార్టీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. కబ్రస్తాన్లలో భారీ వృక్షాలను తొలగించాలని, పరిసరాలు శుభ్రం చేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, సిరిసిల్లలో స్లాటర్ హౌస్ నిర్మించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారం అందించాలని పలు మసీద్ కమిటీల అధ్యక్షులు కోరారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి భారతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతం, గ్రామీణ ఉపాధికి భవనాలు

*** భూ సేకరణపై జిల్లా స్థాయి సమీక్ష**
*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, గ్రామీణ ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా చేపట్టనున్న భవనాల నిర్మాణాలు, భూ సేకరణ, భూ పరిపాలన అంశాలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ భవనాలు, మండల కేంద్రాల్లో మండల సమాఖ్య భవనాలు, లైవ్‌లిహుడ్ వర్క్‌షెడ్‌లు, ఆహార ధాన్య గోదాముల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణలో వివాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. భూ భారతి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, రీసర్వే, ఎస్‌ఐఆర్ మ్యాపింగ్, ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించిన భూ సర్వేలను వేగవంతం చేయాలని, వరద ప్రభావిత ప్రాంతాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## జాతీయ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎన్నికైన వైష్ణవి పాఠశాల విద్యార్థిని



(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : జాతీయస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు (ఇన్స్పైర్) కుత్బుల్లాపూర్ మండలం షాపూర్ నగర్ లోని వైష్ణవి పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థిని నోహితి రూపొందించిన ప్రాజెక్టు ఎంపికయింది. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఇంచార్జి డి ఎస్ ఓ శ్రీనివాస్ షీల్డ్, సర్టిఫికెట్ ను అందజేశారు. మొదట మేడ్చల్ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ఇన్స్పైర్ ప్రదర్శనలో తన ప్రతిభను చాటుకుంది. వైష్ణవి పాఠశాల ఫిజిక్స్ టీచర్ పానిగ్రహి పర్యవేక్షణ లో తక్కువ ఖర్చుతో ఒక కాన్ఫరెన్స్ హాల్ లో నెమ్మదిగా ప్రసంగించిన కేవలం సిగ్నల్స్ సహాయం తో ఎక్కువ సౌండ్ వచ్చే విధంగా ఒక డివైస్ ను(లో కాస్ట్ మినేచర్ కమ్యూనికేషన్ డివైస్) రూపొందించింది. ఈ ప్రాజెక్టు చూపరులను ఎంతగానో ఆకట్టుకొని రాష్ట్రస్థాయికి ఎన్నికయింది. జనవరి 7న కామారెడ్డి జిల్లా లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో తన ప్రతిభను చాటుకున్న వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థిని నోహితి జాతీయస్థాయికి ఎంపికైంది. మేడ్చల్ జిల్లా నుంచి 4 ప్రాజెక్టు లు జాతీయ స్థాయికి ఎన్నికగా అందులో కుత్బుల్లాపూర్ కు చెందిన వైష్ణవి పాఠశాల విద్యార్థి కి చెందింది ఒకటి కావడం సంతోషం గా ఉందని వైష్ణవి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ అన్నారు. జాతీయ స్థాయికి ఎన్నికైన విద్యార్థిని, టీచర్ ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైష్ణవి గ్రూప్ అకాడమిక్ డైరెక్టర్ సాయిబాబా పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉద్యోగ కాలమాలిని ఆవిష్కరించిన జిల్లా జడ్జి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: దివ్యాంగ ఉద్యోగ సంఘం 2026 కాలమానిని జిల్లా జడ్జి పి వసంత్ పాటిల్ మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఏదో లోపం ఉన్నప్పటికీ వారు ఎంతో జ్ఞానము, తెలివి, మానసిక, దృఢత్వము కలిగి సమాజంలో ఉన్నత స్థితిలోకి వెళ్తూ అందరితో సమానంగా వారు జీవితాన్ని ముందుకు నడిపిస్తు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. వైకల్యాన్ని లెక్క చేయకుండా కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి సమాజానికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, దివ్యాంగ ఉద్యోగ సంఘం అధ్యక్షులు మాలోతు జగ్గుదాస్, గౌరవ అధ్యక్షులు రాము, మహిళా ప్రధాన కార్యదర్శి ఉపేంద్రమ్మ, రంజాన్ మియా, నరసింహ, రవికుమార్, బాలకృష్ణ, మేడి. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి : ఎస్పీ రోహిత్ రాజు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం (పాల్వంచ): రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన వినూత్న కార్యక్రమం అరైవ్.. అలైవ్2026 అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. మంగళవారం పాల్వంచలోని కెఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాధాన్యతను వివరించారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేకపోయినా రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్‌లోడ్ వల్ల కలిగే ప్రమాదాలపై హెచ్చరించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఓటీపీ, హనీట్రాప్, ఆన్‌లైన్ ట్రేడింగ్, సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే గంజాయి సేవిస్తూ పట్టుబడితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, జిల్లా రవాణాధికారి భూషితా రెడ్డి, ఎంవీఐ వెంకట రమణ, కళాశాల చైర్మన్ నాగమణి, డైరెక్టర్ సిద్ధార్థ్ రెడ్డి, సీఐ సతీష్, ఎస్సై సుమన్ తదితరులు పాల్గొన్నారు



# అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదు

* **పారదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలి**
* **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
* **రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. మంగళవారం సిరిసల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్ (కరదీపిక) ను చదువుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏ సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే మున్సిపల్ కార్యాలయాన్ని ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఎస#వతీతీ#సీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో విధులు నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, మాస్టర్ ట్రెయినర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతకు అరైవ్.. అలైవ్ నినాదం

* **లారీ డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్.. అలైవ్-2026 కార్యక్రమంలో భాగంగా జీఎం కార్యాలయం సమీపంలో టూ టౌన్ సీఐ ప్రతాప్ ఆధ్వర్యంలో లారీ అసోసియేషన్ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలపై విస్తృతంగా వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ ఉంటే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేకపోయినా వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్‌లోడ్ వాహనాల వల్ల కలిగే ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. తమ ప్రాణ భద్రతతో పాటు ఇతరుల భద్రతకూ ట్రాఫిక్ నిబంధనలు గౌరవిస్తూ సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ప్రతాప్, ఎస్సైలు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శ్వేత మానస, పోలీస్ సిబ్బంది, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, లారీ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

## తెలంగాణలో డిగ్రీ, పీజీ సిలబస్ మార్పు.. ఉన్నత విద్యా మండలి కీలక నిర్ణయం

తెలంగాణలోని ఉన్నత విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (TGCHE) శ్రీకారం చుట్టింది. మంగళవారం టీజీసీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిస్టా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (EC) సమావేశంలో అండర్ గ్రాడ్యుయేట్ (UG), పోస్ట్ గ్రాడ్యుయేట్ (PG) సిలబస్‌ను మార్చాలని నిర్ణయించారు.

**ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టుగా సిలబస్**

విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలతో తీర్చిదిద్దేందుకు, సిలబస్‌ను ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా రూపొందించనున్నారు. ఇందుకోసం వీసీల నేతృత్వంలో సబ్జెక్టుల వారీగా కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్పుల కోసం CCMB, IITs, IICT, DRDO వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి సూచనలు తీసుకోనున్నారు. ఇప్పటికే మొదటి సంవత్సరం యూజీలో మార్చిన సిలబస్‌కు ఆమోదం తెలిపిన మండలి, రెండు, మూడో సంవత్సరం డిగ్రీ, పీజీ సిలబస్‌ను త్వరలోనే సవరించనుంది.

**చదువుకుంటూ సంపాదన.. కోర్సుల విస్తరణ**


విద్యార్థులు చదువుకుంటూనే సంపాదించుకునేందుకు వీలుగా ప్రవేశపెట్టిన 'అప్రెంటిస్‌షిప్ఎంబెడెడ్' కోర్సులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి NAAC గుర్తింపు ఉన్న అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు విస్తరించనున్నారు. ప్రస్తుతం 23 కళాశాలల్లో 1,071 మంది విద్యార్థులు ఈ కోర్సులను అభ్యసిస్తున్నారు. విశేషమేమిటంటే, ఈ కోర్సుల్లో చేరే విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5000 ను ఉన్నత విద్యా మండలి, ఆయా విశ్వవిద్యాలయాలే భరిస్తాయి.

**పాలిటెక్నిక్ కళాశాలలకు సహకారం**

యూనివర్సిటీల పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలకు అండగా నిలవాలని వర్సిటీలను మండలి కోరింది. పాలిటెక్నిక్ విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లోని ప్రయోగశాలలు, సాంకేతిక వనరులను ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని సూచించింది. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇ. పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, కళాశాల విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేన, పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకే వడ్డీ లేని రుణాలు

**: మంత్రి కోమటిరెడ్డి**



కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా... యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మి నరసింహ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.98,23,458 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ప్రవేశ పెట్టిందని రాష్ట్రంలో 265 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణం చేసినట్లు అందుకు గాను ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ధనిక కుటుంబ సభ్యులు ఏ బియ్యం అయితే తింటున్నారో అవే సన్న బియ్యం ప్రతి పేద ప్రజలు కడుపు నిండా అన్నం తినాలనే లక్ష్యంతో మనిషికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నామని అన్నారు.



## ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం

* **మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది**

ప్రజా స్ఫూర్తి, కొత్తగూడెం:ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ఆవరణలో మంగళవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెడ్ ఆఫ్ ప్రోగ్రాం కొలిపాక శంకర్ రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆకాశవాణి సిబ్బంది సమిష్టిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారు.ఈ సందర్భంగా కొలిపాక శంకర్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే చిన్నపిల్లలకు పోషకాహారం లోపం రాకుండా పోషక ఆహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ స్టాఫ్ ప్రభాకర్ రావు, ఆనందరావు, కోటేశ్వరరావు, సుగ్రీవ, నరసయ్య, అనౌన్సర్లు శ్రీనివాస్, శ్యామ్ ప్రసాద్, రచ్చ రవి, అలాగే కిరణ్ కుమారి, స్వప్న, విశాలిని, మౌనిక, ప్రియాంక, సౌజన్య, సరోజ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్, సింగరేణియన్ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చే ప్రశంసలు అందుకున్న మొక్కల రాజశేఖర్ కూడా పాల్గొని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు స్వచ్ఛత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారని నిర్వాహకులు తెలిపారు.


## అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తాం

* **అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హామీ ఇచ్చారు. అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఖాజా నగర్ కాలనీ లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి , చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు , కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఖాజా నగర్ కాలనీలో డ్రైనేజీ ,సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి , సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంబాలు, విద్యుత్ లైట్లు , ట్రాన్స్పార్మర్ చుట్టూ ఫినిసింగ్ లు నిర్మించాలని కాలనీ వాసులు తెలుపగా, కార్పొరేటర్ సంబంధిత అధికారులను అదే విధంగా వెంటనే విద్యుత్ కు సంబందించిన సమస్యలను పరిష్కరించాలని తెలియచేసారు. కాలనీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన రోడ్లు, డ్రైనేజీ, త్రాగు నీరు, వీధి దీపాలు, పారిశుద్యం వంటి పెండింగ్ ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని అన్నారు. అదేవిధంగా కాలనీ వాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, కాలనీ వాసులందరి సమిష్టి కృషి తో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ గారు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, గోపాల్, షౌకత్ అలీ మున్నా, కైసర్, ఖాజా, సుల్తాన్, ఫిరోజ్, ఎమ్.డి గౌస్, ఎస్.కె గౌస్, మెహబూబ్, నవాజ్, అక్బర్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎ.ఇ యుగంధర్ రెడ్డి, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు అలర్ట్.. బోర్డు కీలక సూచనలు..!



రాష్ట్రంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు వచ్చే నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ బోర్డు కీలక సూచన చేసింది. పరీక్షా హాల్‌లోకి అనుమతించేందుకు 5 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌గా నిర్ణయించినట్లు బోర్డు వెల్లడించింది. ఈ నిబంధనను గతేడాది కూడా అమలు చేశారు. ఈ ఏడాది కూడా అమలు చేయాలని ఇంటర్ బోర్డు పేర్కొంది. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. 9.05 గంటల వరకు పరీక్షా హాల్లోకి అనుమతించనున్నారు. ముందు జాగ్రత్తగా పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 8.45 గంటల వరకే చేరుకోవాలని బోర్డు అధికారులు సూచించారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. 202526 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మొత్తం 10,47,815 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇందులో 9.96 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజు చెల్లించారు. మొత్తం 1495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## ఆలయంలో మూడు రోజుల పాటు శ్రీ మహాశివరాత్రి ఉత్సవాలు జరపాలి

* **ఆలయ కమిటీ తీర్మానం**



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం లో 101వ మహా శివరాత్రి వేడుకలను ఫిబ్రవరి 14 ,15,16 మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించాలని ఆలయ కమిటీ తీర్మానించింది. ఆదివారం ఆలయంలో జరిగిన కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకోవటం జరిగింది. భక్తులకు, దాతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూడు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని కమిటీ సమావేశంలో నిర్ణయించటం జరిగింది. ఈసారి ప్రత్యేకంగా దాతలకు పాసులు జారీ చేసి సరైన గౌరవం ఇవ్వాలని, ఆలయం ఏర్పడి మహా శివరాత్రి నాటికి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆలయ మండపం లో నిర్మిస్తున్న అష్టాదశ శక్తి పీఠాలకు సంబంధించిన అమ్మవారి విగ్రహాల ఏర్పాటు పనులు కొనసాగుతున్న దృశ్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిటీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆలయ రాజ గోపురం ప్రారంభించిన అనంతరం మొదటి మహా శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్ణయించారు. మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్ల కోసం , శక్తిపీఠాల కు సంబంధించిన అమ్మవారి విగ్రహాల ఏర్పాటు కోసం సహకరించాలనుకునే భక్తులు, దాతలు తమ వంతు విరాళాలు అందజేసి రసీదు పొందాలన్నారు. వీరికి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా స్వామివారి దర్శనం చేయించడమే కాకుండా వేద పండితుల ద్వారా సన్మాన కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు.

## ఓయూ అధికారుల తాట తీస్తా.. ఖబడ్దార్

**: వీసీ, రిజిస్ట్రార్లపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గర్జన**

ఉస్మానియా యూనివర్సిటీ (OU) వేదికగా అధికారుల అరాచకాలు సాగుతున్నాయని, బీసీ ప్రొఫెసర్లను వేధిస్తే సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఓయుటీఏ (OUTA) అధ్యక్షుడు, ప్రొఫెసర్ మనోహర్‌పై విధించిన సస్పెన్షన్ వేటును నిరసిస్తూ మంగళవారం ఆయన యూనివర్సిటీని సందర్శించారు.

* **అధికారులు పారిపోతారా? కుర్చీలో కూర్చునే అర్హత ఉందా?**

సమస్యపై చర్చించేందుకు యూనివర్సిటీకి వచ్చిన మల్లన్నకు వీసీ, రిజిస్ట్రార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన నిప్పులు చెరిగారు. "ఒక ఎమ్మెల్సీగా ప్రజా సమస్యపై మాట్లాడటానికి వస్తే భయపడి పారిపోతారా? కనీసం బాధ్యత లేకుండా ప్రవర్తించే మీకు ఆ కుర్చీల్లో కూర్చునే అర్హత ఉందా?" అని ప్రశ్నించారు. బీసీ ప్రొఫెసర్ల జోలికొస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అధికారులను చట్టం ముందు నిలబెట్టి తాట తీస్తానని హెచ్చరించారు.

* **వర్సిటీ ఏమైనా మీ అయ్య జాగీరా?**


విశ్వవిద్యాలయం ప్రజాస్వామ్యబద్ధంగా నడవాలని, అధికారుల సొంత జాగీరులా వ్యవహరిస్తే ఊరుకోబోమని మల్లన్న మండిపడ్డారు. ప్రొఫెసర్లను గేటు బయట ఆపే సంస్కృతికి చరమగీతం పాడాలన్నారు. ప్రొఫెసర్ మనోహర్‌ని గేటు వద్ద ఆపిన సిబ్బందితో అక్కడికక్కడే క్షమాపణలు చెప్పించారు. తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేదంటే వర్సిటీని దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

**మంత్రులతో ఫోన్లో మల్లన్న చర్చలు**

వీసీ, రిజిస్ట్రార్ అందుబాటులో లేకపోవడంతో మల్లన్న అక్కడి నుంచే మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో ఫోన్లో మాట్లాడారు. "కొందరు అధికారులు కావాలనే ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రులు, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

# ఈ నెల 24 లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్?

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించనున్నారు. గురువారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్లతో, ఈనెల 23న రంగారెడ్డి, మేడ్చల్, ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నారు. ఈనెల 24న లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




## సిట్ విచారణను పక్కదారి పట్టించేందుకు హరీశ్ యత్నం: చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు సిట్ పిలుస్తుందని తెలియగానే బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ప్రభుత్వంపై బురద చల్లారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సిట్ విచారణను పక్క దారి పట్టించే విధంగా ఆయన మాట్లాడారన్నారు. సిట్ విచారణలోని వాస్తవాలను ప్రజలకు తెలియకుండా ట్రిక్స్ ప్లే చేస్తున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏం జరిగిందో తెలంగాణ సమాజానికి తెలియజెప్పేందుకే సిట్ దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. "సృజన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సింగరేణి కాంట్రాక్టులు కట్టబెట్టారని హరీశ్ రావు, కేటీఆర్ ఆరోపిస్తున్నారు. సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి అల్లుడు. తన అల్లుడిని ఎందుకు బద్నాం చేస్తున్నారని ఆయన గతంలోనే ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలోనూ సృజన్ రెడ్డి తదితరులకు కాంట్రాక్టులు దక్కాయి. రేవంత్ రెడ్డికి మీలాగా దోచుకోవాలనే ఆలోచన లేదు. గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి, కేటీఆర్, హరీశ్‌రావుకు మంచి సంబంధాలున్నాయి. లోక్‌సభ సభ్యుడిగా సింగరేణిలో నిజానిజాలు తేలాలని కేంద్రానికి లేఖ రాస్తాను. హిల్ట్ పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం కేవలం చర్చ మాత్రమే చేసింది. అందులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదు. రూ.5 లక్షల కోట్లు అంటూ కేటీఆర్, హరీశ్‌రావు హడావుడి చేస్తున్నారు. సొంత ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని మాజీ ఎమ్మెల్సీ కవిత స్వయంగా చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అధికార దుర్వినియోగం బయటపడుతుంటే ఆ పార్టీ నేతలు తట్టుకోలేకపోతున్నారు" అని చామల వ్యాఖ్యానించారు.


## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారున్నా శిక్ష తప్పదు




కామారెడ్డి: ఫోన్ ట్యాపింగ్ కేసుపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ కేసులో ఎంతటి వారున్నా శిక్ష తప్పదన్నారు. సిట్ విచారణపై హరీశ్ రావు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ మాట్లాడారు. దేశంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు అతిపెద్ద నేరమని వ్యాఖ్యానించారు. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. తన ఫోన్, షబ్బీర్ అలీ సహా చాలామంది ఫోన్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలపై రాజకీయ వేధింపులకు పాల్పడే ఉద్దేశం సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇంకోసారి ఇలాంటివి జరగకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు.

## కొండగట్టు అంజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

మల్యాల: జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో తాకిడి పెరిగింది. వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తుల రద్దీతో ఘాట్ రోడ్డుపై వాహనాలు కాసేపు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో శ్రీకాంతరావు పరిశీలించారు.





### తెలంగాణకు మరో 6 అర్బన్ ఫారెస్టుల

## ఏర్పాటుకు కేంద్రం ఆమోదం



హైదరాబాద్: ప్రకృతి, పర్యావరణ ప్రేమికులకు శుభవార్త. తెలంగాణకు మరో 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ 'నగర్ వన్ యోజన' కింద నిధులు మంజూరయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా మావలా, యాపల్‌గూడII, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మండలం ఇందారం, చెన్నూర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యెల్లంపేట, చెంగిచెర్లలో ఈ అర్బన్ ఫారెస్టులు ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఆమోదించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణలో ఈ 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటుకు మొదటి విడత కింద 70 శాతం నిధులు రూ.8.26 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అటవీ ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సి.సువర్ణ వెల్లడించారు. ఈ నిధులు తెలంగాణ అటవీ శాఖ పరిధిలోని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా వినియోగించనున్నట్లు తెలిపారు. నగరాలు, పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడటం, కాలుష్యం తగ్గించడం, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

### తప్పు చేయనప్పుడు భయమెందుకు?

## హరీశ్‌రావుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరయ్యే ముందు మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్తది కాదని.. గత రెండేళ్లుగా దీనిపై విచారణ జరుగుతోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. హరీశ్‌రావు పోరాటయోధుడిలా ఫీలవుతున్నారని వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు ఫోన్లు ట్యాప్ చేయించారని ఆరోపించారు. "ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల ముందు డ్రామా చేస్తున్నారని హరీశ్ బాధపడిపోతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని ఎలా వేధించారో తెలంగాణ ప్రజలకు తెలుసు. ఎన్నో కేసులు పెట్టి ఆయన్ను అణగదొక్కాలని చూశారు. సీఎంపై నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదు" అని అయిలయ్య అన్నారు. హరీశ్‌రావుకు నిజాయతీ ఉంటే తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకోలేదని ప్రమాణం చేయగలరా? అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సవాల్ విసిరారు. తప్పు చేయకపోతే ఇబ్బంది ఎందుకని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన బాధితుడైతే సంబంధిత వివరాలను సిట్‌కు తెలపాలని.. బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "అధికారులతో తప్పుడు పనులు చేయించి తెలంగాణను అభాసుపాల్జేశారు. కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు. రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసం కావడానికి కేసీఆర్ కారణం. మేం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ నేతలు బయట తిరగలేరు. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుంది" అని దయాకర్ అన్నారు. హరీశ్‌రావు సిట్ విచారణకు వస్తూ హడావుడి ఎందుకని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో చాలా మంది ఇబ్బందిపడ్డారని చెప్పారు. తప్పు చేయనప్పుడు భయమెందుకన్నారు.

### ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో

## ఇంకెన్నాళ్లీ డ్రామాలు: బండి సంజయ్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ పేరుతో ఇంకెన్నాళ్లు డ్రామాలు ఆడతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ కేసులో మంగళవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావును సిట్ అధికారులు విచారించడంపై ఆయన స్పందించారు. ఫోన్ ట్యాపింగ్‌కు కారకులైన ఒక్క నాయకుడినైనా అరెస్టు చేశారా? అని తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులైన తండ్రీకొడుకులను ఎందుకు విచారించట్లేదు? తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని హరీశ్ రావు గతంలో చెప్పారు. చాలా రోజులు ఆయన ఫోన్ కూడా మాట్లాడని విషయం మీకు తెలియదా? రెండేళ్లుగా సాగుతున్న విచారణలో కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేకపోయారు. కేసీఆర్ సర్కార్ మాదిరిగానే ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఫోన్ ట్యాపింగ్ కేసును వాడుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారుల్ని వెంటనే అరెస్టు చేయాలి" అని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు.

## సిట్ విచారణ కాదు.. పిచ్చి విచారణ: కేటీఆర్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణపై కేటీఆర్ స్పందించారు. ఇది సిట్ విచారణ కాదని.. పిచ్చి విచారణ అని వ్యాఖ్యానించారు. సిట్ విచారణకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరైన నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. న్యాయం కోసం హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు నెరవేర్చలేక నిలదీసిన వారిపై కేసులు నమోదు చేస్తోందని విమర్శించారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి సీఎం బావమరిది సృజన్‌రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ నేతలను విచారణ చేయొద్దని చట్టం ఏమైనా ఉందా?: బల్మూరి వెంకట్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ విచారణకు పిలిస్తే.. తెలంగాణ జాతిపితలాగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. గతంలో తన ఫోన్ ట్యాప్ అయ్యిందని.. తనను కూడా విచారణకు పిలిచినట్లు చెప్పారు. సీఎల్పీ మీడియా సెంటర్ వద్ద బల్మూరి వెంకట్ మాట్లాడారు. "నా కుటుంబ సభ్యులతోపాటు మా ఇంటి వాచ్‌మెన్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో అత్యధిక కేసులు పెట్టింది నా పైనే. గాంధీ భవన్ లోపలికి వచ్చి మరి అరెస్ట్ చేశారు. మా ఎమ్మెల్యేలను బెదిరించి మీ పార్టీలో చేర్చుకున్నారు. మా ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్న కేటీఆర్ ఆధారాలు చూపించాలి. మిమ్మల్ని విచారణ చేయవద్దని చట్టం ఏమైనా ఉందా?" అని బల్మూరి వెంకట్ ప్రశ్నించారు.

## ఇకపై దుర్గం చెరువు బాధ్యత మాది: హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్: నగరంలోని దుర్గంచెరువుపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. చెరువు పరిసర ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల, రహేజా అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ సమీప ప్రాంతాల నుంచి మురుగునీరు చేరడం వల్లే దుర్గం చెరువులో గుర్రపుడెక్క భారీగా పెరిగిందన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోలేదని.. ఇకపై ఈ చెరువు బాధ్యతను హైడ్రా తీసుకుంటుందని చెప్పారు. దుర్గంచెరువులో గుర్రపుడెక్క పెరగడంతో పర్యాటకం దెబ్బతింది. దీంతో చెరువులో పర్యాటక బోట్లు నిలిచిపోయాయి. బోటింగ్ లేకపోవడంతో సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ దుర్గం చెరువును పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు.



# ఒక్కో పోస్టింగ్‌కు రూ.కోటి లంచం: బదిలీల్లో రూ.366కోట్ల కుంభకోణం

కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. తమిళనాడు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లయ్ విభాగంలో రూ.366 కోట్ల మేర అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా మరికొన్ని వివరాలు వెల్లడించింది. ఈ విభాగంలో సిబ్బంది బదిలీల సందర్భంగా పెద్ద ఎత్తున నగదు చేతులు మారినట్లు పేర్కొంది. ఒక్కో పోస్ట్‌కు రూ.7లక్షల నుంచి రూ.కోటి వరకు లంచాలు తీసుకున్నారంటూ తమిళనాడు ప్రభుత్వానికి లేఖ రాసింది. 340 మంది అధికారుల బదిలీలు పోస్టింగ్‌కు సంబంధించిన వ్యవహారంలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారినట్లు పేర్కొంది. ఈ లంచం డబ్బును రియల్ ఎస్టేట్, విదేశాల్లో ఆస్తుల కొనుగోలు, బులియన్‌లో పెట్టుబడుల కోసం ఉపయోగించినట్లు లేఖలో ప్రస్తావించింది.




2025 ఏప్రిల్‌లో బ్యాంకు మోసం కేసులో దర్యాప్తు సందర్భంగా ఈ అవకతవకలు బయటకువచ్చాయని వెల్లడించింది. ఈ క్రమంలో తమిళనాడు మంత్రి కె ఎన్ నెహ్రూ, ఆయనతో సంబంధం ఉన్న కొందరి పేర్లు వెలుగులోకి వచ్చాయి. లంచాలు తీసుకునే సమయంలో జరిగిన వాట్సప్ చాట్స్, కొన్ని పత్రాలు, ఫొటోలను స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా రాసిన లేఖలో పేర్కొంది. మంత్రి, ఇతరులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఈడీ చెన్నై జోనల్ ఆఫీస్ నుంచి చీఫ్ సెక్రటరీ, డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్‌కు లేఖలు వెళ్లాయి. గతంలోనూ ఈ అవినీతి వ్యవహారంలో మంత్రి పేరును ప్రస్తావిస్తూ తమిళనాడు ప్రభుత్వానికి ఈడీ లేఖలు రాసింది. అయితే తనపై వచ్చిన ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. ఈ ఆరోపణలను తాను చట్టబద్ధంగా ఎదుర్కొంటానని వెల్లడించారు.

## భార్యాభర్తల గొడవలు.. కోర్టుల్ని యుద్ధభూములుగా చేసుకోవద్దు: సుప్రీంకోర్టు

వైవాహిక జీవితంలో గొడవలు పడే దంపతులు కోర్టులను యుద్ధభూములుగా చేసుకుని సాగించే వ్యక్తిగత కక్ష సాధింపులను అనుమతించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థానంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు ఈ కేసులను మరింత జటిలం చేస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో త్వరితగతిన పరిష్కారం కోసం మధ్యవర్తిత్వ మార్గాన్ని అనుసరించాలని సూచించింది. ఈ విధానం ద్వారా చాలా కేసుల్లో సానుకూల ఫలితాలు వస్తున్నట్లు తెలిపింది. పెళ్లి చేసుకుని కేవలం 65 రోజులే కలిసి ఉండి, పదేళ్లుగా దూరంగా ఉంటున్న ఓ జంటకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. ఈ వివాహ బంధం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైందని పేర్కొంటూ.. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి విడాకులు మంజూరు చేసింది. వైవాహిక



వివాదాల్లో ఇరుపక్షాలు.. అవతలి పక్షానికి ఎలా బుద్ధి చెప్పాలా? అనే దానిపై దృష్టి పెడుతున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. కొన్నిసార్లు కృత్రిమ మేధ వంటి సాంకేతికతలను ఉపయోగించి ఆధారాలను సృష్టిస్తున్నట్లు తెలిపింది. తప్పుడు ఆరోపణలు పెరుగుతున్నట్లు చెప్పింది. ఇటువంటి వివాదాలు సమాజంపై ప్రభావం చూపుతాయని, ఈ నేపథ్యంలో కేసులు దాఖలు చేయడానికి ముందే వాటిని పరిష్కరించేందుకు కుటుంబ సభ్యులు తదితరులు ప్రయత్నించాలని సూచించింది.

## కోర్టు ధిక్కారమే..! మేనకా గాంధీ విమర్శలపై సుప్రీం సీరియస్

కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీపై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వీధి శునకాలపై ఇచ్చిన తీర్పుపై మేనకా చేసిన విమర్శలను తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆమె కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని అభిప్రాయపడింది. వీధి శునకాల అంశంపై నేడు మరోసారి విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ..ఎటువంటి ఆలోచన లేకుండా కేంద్ర మాజీ మంత్రి అందరిపై అన్ని రకాల వ్యాఖ్యలు చేశారని మండిపడింది. "కోర్టు ఆచితూచి వ్యవహరించాలని మీరు చెబుతున్నారు. కానీ, మీ క్లయింటు (మేనకా గాంధీ) ఎటువంటి వ్యాఖ్యలు చేశారో అడిగారా? ఆమె పాడ్‌క్యాస్ట్‌ను విన్నారా? ఆలోచన లేకుండా ప్రతి ఒక్కరిపై అన్ని రకాల వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ఆమె తీరు గమనించారా?" అని మేనకా గాంధీ తరపున సీనియర్ అడ్వేకేట్ రాజు రామచంద్రన్‌ను సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఆమె మాటలు కోర్టు ధిక్కారమే అయినప్పటికీ న్యాయస్థానం ఔన్నత్యం దృష్ట్యా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. వీధి శునకాల



సమస్యను కట్టడిచేసేందుకు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆమె ఎంత బడ్జెట్ కేటాయించారని ఈ సందర్భంగా పిటిషనర్‌ను జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. శునకాలకు ఆహారం పెట్టేవారిని జవాబుదారీ చేయాలని తేలిగ్గా న్యాయస్థానం వ్యాఖ్యానించలేదని, సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అలా చెప్పామన్నారు.

## అబూసలేంకు పెరోల్ ఇస్తే పారిపోతాడు: మహారాష్ట్ర ప్రభుత్వం


ముంబయి పేలుళ్ల ఘటన (1993)లో కీలక పాత్రధారి అబూసలేంపై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. తన సోదరుడి మరణం నేపథ్యంలో 14 రోజుల పెరోల్ కోరుతూ బాంబే హైకోర్టులో అబూ సలేం పిటిషన్ వేశాడు. దానిని వ్యతిరేకిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆ గ్యాంగ్‌స్టర్‌కు పెరోల్ ఇస్తే పారిపోతాడని తెలిపింది. 1993లో పోర్చుగల్‌కు పారిపోయిన అంశాన్ని గుర్తు చేసింది. అవసరం అయితే రెండు రోజుల పెరోల్ ఇవ్వొచ్చని సూచించింది. అబూ సలేం ఒక అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ అని, దశాబ్దాల పాటు నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడని మహారాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తన



సోదరుడి కుటుంబం ఉంటున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సరాయ్మీర్ ప్రాంతానికి వెళ్లాలని అతడు తన పిటిషన్‌లో కోరడంపై యూపీ పోలీసులు కూడా ప్రతికూలంగా స్పందించారు. అది మతపరంగా సున్నితమైన ప్రాంతం కావడంతో అక్కడికి వెళ్లడం ప్రమాదకరమన్నారు. పేలుళ్ల ఘటనకు పాల్పడిన అబూసలేం నకిలీ పాస్‌పోర్ట్‌తో పోర్చుగల్‌కు పారిపోయాడు. అక్కడ పోలీసులు అరెస్టు చేయడంతో అతని జాడ వెల్లడయింది. అనంతరం భారత అధికారుల అభ్యర్థన మేరకు అతడికి మరణ శిక్ష విధించరాదని, 25 ఏళ్లకు ఎక్కువ జైలు శిక్ష విధించవద్దనే షరతులతో అతడిని 2005లో భారత్‌కు అప్పగించారు. పేలుళ్లు, బెదిరింపులు, హత్య కేసుల్లో 2015లో అతడికి జీవిత ఖైదు పడింది. నాటి నుంచి మహారాష్ట్రలోని తలోజా సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు.

## 12వేల మంది పోలీసులు.. 72 గంటలు
## గ్యాంగ్‌స్టర్లపై 'ఆపరేషన్ ప్రహార్'

గ్యాంగ్‌స్టర్లు, సంస్థాగత నేరముఠాలపై పంజాబ్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. 'ఆపరేషన్ ప్రహార్' పేరుతో 72 గంటల పాటు దాదాపు 12 వేలమంది సిబ్బందితో విస్తృత స్థాయి ఆపరేషన్ ప్రారంభించినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. దాదాపు 1,200 మంది అనుమానితులను లక్ష్యంగా చేసుకుని, 2 వేల ప్రదేశాలలో దాడులు నిర్వహిస్తున్నామని డీజీపీ వెల్లడించారు. తమ నిఘా వర్గాలు అందించిన సమాచారంతో ఈ సిండికేట్ల



నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంజాబ్‌ను పూర్తిగా నేర రహితంగా మార్చాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్‌లో పెరుగుతోన్న గ్యాంగ్‌స్టర్ సంస్కృతిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వ్యవస్థీకృత నేరాలను నిర్మూలించాలని.. ప్రజా భద్రతకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు 'ఆపరేషన్ ప్రహార్'ను చేపట్టారు.


## దేశం కోసం బుల్లెట్లు ఎదుర్కొన్నాం: ఫారూక్ అబ్దుల్లా

దేశం కోసం తాము బుల్లెట్లను ఎదుర్కొన్నామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. అవసరమైతే మరోసారి ఎదురు నిలబడతామన్నారు. జమ్మూకశ్మీర్‌ను మళ్లీ విభజించాలనే డిమాండ్లను తప్పుపట్టారు. వాటిని మూర్ఖత్వంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో లద్దాఖ్ తిరిగి జమ్మూకశ్మీర్‌లో విలీనం కావొచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమం సందర్భంగా మీడియాతో ఈమేరకు మాట్లాడారు. ఎన్‌సీ, పీడీపీలు జమ్మూకశ్మీర్‌లో రాళ్లదాడులు, ఉగ్రవాదాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని భాజపా చేసిన ఆరోపణలను ఫరూక్ అబ్దుల్లా ఖండించారు. "అలజడులు సృష్టించాలనుకుంటున్నది వారే.. మేం కాదు. దేశ సమగ్రతకు మేం బుల్లెట్లు ఎదుర్కొన్నాం. అవసరమైతే మరోసారి సిద్ధమే" అని అన్నారు. జమ్మూకశ్మీర్ నుంచి జమ్మూను విడదీసి రాష్ట్ర హోదా ఇవ్వాలంటూ వస్తున్న డిమాండ్లపై స్పందిస్తూ.. తమ పార్టీ ఎప్పుడూ అలాంటి ఆలోచనలు చేయలేదని తెలిపారు. గతంలో లద్దాఖ్‌ను విడగొట్టారని, దాని వల్ల ఏం ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. ఏదో ఒక రోజు లద్దాఖ్ తిరిగి జమ్మూకశ్మీర్‌లో కలుస్తుందన్నారు. స్థానికంగా కొత్త జిల్లాల ఏర్పాటు అనవసరమని చెప్పారు. పాకిస్థాన్‌తో భారత్ చర్చలు జరపాలా? వద్దా? అనే అంశంపై



స్పందిస్తూ.. మీడియాకు 'పాకిస్థాన్ ఫోబియా' ఉందని ఆరోపించారు. పొరుగు దేశాలను మార్చలేమని గతంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు.

## రోడ్లు, నీళ్లు చంపేస్తుంటే.. ఎవరు జవాబుదారీ? : నోయిడా టెకీ మరణంపై రాహుల్ గాంధీ



ఉత్తర్‌ప్రదేశ్ నోయిడాలో నీటిగుంతలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యువరాజ్ మెహతా మరణించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆ ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. ఇటీవల ఇండౌర్‌లో చోటుచేసుకున్న కలుషిత నీటి మరణాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరైన జవాబుదారీతనం లేకపోవడంవల్లే దేశంలో పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "రోడ్లు (నోయిడా ఘటనను ఉద్దేశిస్తూ).. నీళ్లు (ఇండౌర్ ఘటన).. అగ్నిప్రమాదాలు (గోవా ఘటన) ప్రాణాలు తీస్తున్నాయి. వంతెనలు, కాలుష్యం, అవినీతి.. ఇలా అనేక కారణాలతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. పట్టణాల్లో ఇలాంటి ఘటనలకు నిధులు, సాంకేతికత, పరిష్కారం లేకపోవడం కారణం కాదు. సరైన సమయంలో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడమే అసలైన సమస్య. ప్రభుత్వ పట్టింపు లేని చర్యలే ఈ మరణాలకు కారణం" అని మండిపడ్డారు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోన్న యువరాజ్ గతవారం విధులు ముగించుకొని ఇంటికి తిరిగొస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నోయిడాలోని సెక్టార్ 150లోని ఏటీఎస్ లే గ్రాండియోస్ కూడలి వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి మురుగుకాలువ గోడను ఢీకొట్టి పక్కనే ఉన్న నీటి గుంతలో పడింది. ఊపిరాడక ఆ టెకీ ప్రాణాలు కోల్పోయారు. ఈ నీటి గుంత గురించి గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపించారు.

## ప్రసంగంలో కొన్ని పేరాలు
# చదవని గవర్నర్.. కేరళలోనూ వివాదం

తిరువనంతపురం: కేరళలో నేటినుంచి మొదలైన అసెంబ్లీ సమావేశాల్లో వివాదం చెలరేగింది. సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రసంగించిన గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ కాపీలోని అన్ని అంశాలను చదవకపోవడంపై కేరళ ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తంచేసింది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విధాన ప్రసంగంలోని రెండు భాగాలను ఆయన వదిలేశారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. అర్లేకర్ సభ నుంచి నిష్క్రమించిన తర్వాత సీఎం మాట్లాడుతూ.. ప్రసంగంలోని 12వ పేరా ప్రారంభ అంశాలను, 15వ పేరా ముగింపు అంశాలను గవర్నర్ చదవలేదని స్పీకర్‌కు వెల్లడించారు. అయితే సభా నిబంధనల ప్రకారం రాష్ట్ర



మంత్రివర్గం ఆమోదించిన విధాన ప్రసంగాన్నే అధికారికంగా భావిస్తామని స్పీకర్ ఎ.ఎన్. షంసీర్ పేర్కొన్నారు. కొన్ని అంశాలను వదిలేస్తూ.. గవర్నర్ చేసిన ప్రసంగాన్ని అధికారికంగా గుర్తించబోమన్నారు. కాగా తమిళనాడు శాసనసభ సమావేశంలో కూడా అక్కడి గవర్నర్ ప్రసంగం మధ్యలో అసెంబ్లీ నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.



## లండన్‌లో చైనా 'మెగా' ఎంబసీ.. బ్రిటన్ ఆమోద ముద్ర

లండన్‌లో ఐరోపాలోనే అతిపెద్ద చైనా రాయబార కార్యాలయ నిర్మాణానికి బ్రిటన్ పచ్చ జెండా ఊపింది. ఈ ఎంబసీ ఏర్పాటుతో భద్రతాపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే ఆందోళనల నడుమ.. ఈమేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. స్థానిక అధికారి స్టీవ్ రీడ్ ఈ భవనానికి సంబంధించిన ప్రణాళికలను ఆమోదించారు. మెగా ఎంబసీ ఏర్పాటు కోసం చైనా 2018లోనే టవర్ ఆఫ్ లండన్ సమీపంలో 5.4 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. దీని కోసం 225 మిలియన్ పౌండ్లు చెల్లించింది. 20 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ కాంప్లెక్స్‌లో 208 రహస్య బేస్‌మెంట్ గదులు కూడా ఉంటాయని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ క్రమంలోనే ప్రతిపాదిత దౌత్య కార్యాలయాన్ని చైనా తన గూఢచర్య కార్యకలాపాలకు వినియోగించుకునే అవకాశం ఉందనే ఆరోపణలు మొదలయ్యాయి. అదేవిధంగా చైనా అసమ్మతివాదులపై నిఘా ముప్పును కూడా ఇది పెంచుతుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లండన్‌లో సున్నితమైన ఆర్థిక సమాచారాన్ని చేరవేసే భూగర్భ కేబుళ్లకు ఈ ప్రదేశం చాలా దగ్గరగా ఉందనే వాదనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. అనుమతి విషయంలో కీర్ స్టార్మర్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పదేపదే వాయిదా వేసింది. మరోవైపు.. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే విషయంలో ఏడేళ్ల జాప్యంపై చైనా నిరసన తెలిపింది. బ్రిటన్ ఈ విషయాన్ని సంక్లిష్టం చేస్తూ, రాజకీయ రంగు పులుముతోందని ఆరోపించింది.

# గ్లోబల్ సంకేతాల దెబ్బ...




## ఆగని వెండి పరుగులు..



## భారత్ కోకింగ్ కోల్ బంపర్ లిస్టింగ్..




# రోహిత్ ఫామ్‌లోనే ఉన్నాడు.. కానీ..







## అసలేం జరుగుతోంది...?



## భారత్‌లో ఆడకుంటే వేటు తథ్యం..



# ఐపీఎల్‌ను కాపీ కొడుతూ.. తొలిసారి ఆటగాళ్ల వేలానికి శ్రీకారం..!






MOVIE TIME

## బాబీ దర్శకత్వంలో
# చిరు తదుపరి సినిమా



**టాకీస్:** ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్ర సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురి సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.



## దృశ్యం-3 కోసం
# వెంకటేశ్ బిజీ

**టాకీస్:** కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.

## శర్వానంద్‌కు కలసి వచ్చిన బాలయ్య
# సెంటిమెంట్

టాకీస్: టాలీవుడ్‌లో కొన్ని చిత్రాలకు సంబంధించిన విశేషాలు భలే ఆసక్తికరంగా మారుతుంటాయి. అలాంటి సంఘటన ఒకటి హీరో శర్వానంద్ నటించిన నారి నారి నడుమ మురారి సినిమాకు జరిగింది. శర్వా హీరోగా రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో అనిల్ సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి సూపర్ హిట్ గా నిలిచింది. ఫెస్టివల్ సీజన్‌లో వచ్చిన చిత్రాల్లో చిన్న సినిమాగా వచ్చి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద



బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా మారింది.ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 36 ఏళ్ల క్రితం నందమూరి బాలకృష్ణ హీరోగా, ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో 'నారి నారి నడుమ మురారి' అనే సినిమా విడుదలై అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. అందుకే అదే టైటిల్‌ను శర్వానంద్ సినిమా కోసం ఫిక్స్ చేయగానే, అది బాలకృష్ణ సినిమా టైటిల్ కదా అని ఆయన అనుమతి తీసుకోవాలని శర్వానంద్ స్వయంగా బాలకృష్ణకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఈ విషయం నాకెందుకు చెప్తున్నావు, నిరభ్యంతరంగా టైటిల్ పెట్టుకో అంటూ బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు, టైటిల్ పెట్టుకోమని చెప్పడమే కాకుండా సినిమా షూటింగ్‌కు, టైటిల్ రివీల్ కు ముహూర్తం కూడా బాలకృష్ణ ఫిక్స్ చేశారట. ఇక భారీ సినిమాల మధ్య పోటీగా రిలీజ్ అయినా నారి నారి నడుమ మురారి శర్వా కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచి ఇటు నిర్మాతలకు అటు డిస్ట్రిబ్యూటర్స్ కు భారీ లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ విషయాన్నీ బాలయ్యకు చెప్పేందుకు శర్వానంద్ మరోసారి కాల్ చేయగా 'నా పేరు కాపాడావు? సినిమా సూపర్ హిట్ అయిందని తెలిసింది. ఇలానే రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు చేయాలి' అంటూ శర్వానంద్‌ను దీవించారట బాలయ్య. ఆ సంతోషాన్ని తన ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటూ ఇక నుంచి నా సినిమాలన్నింటికీ బాలయ్యతోనే ముహూర్తం పెట్టించుకుంటాను అని అన్నారట. మొత్తానికి, బాలయ్య టైటిల్ తో ఆయన పెట్టిన ముహూర్తంతో శర్వానంద్‌కు భారీ హిట్ అందుకున్నాడు.





# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా
## హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు

**టాకీస్:** తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు.

ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ప్లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మారుతి తదుపరి ప్రాజెక్ట్‌పై
# ఊహాగానాలు

టాకీస్: టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మారుతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు, ప్రభాస్‌తో చేసిన ప్రతిష్టాత్మక చిత్రం 'రాజా సాబ్' అనంతరం ఆయన తదుపరి ప్రాజెక్టుల గురించి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై తాజాగా ఒక స్పష్టత వచ్చింది, నిజానికి గత కొన్ని రోజులుగా మారుతి ఒక మెగా హీరోతో సినిమా చేయబోతున్నారని, స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయ్యాయని కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. దీనికి తోడు కొన్ని నిర్మాణ సంస్థల పేర్లు, నిర్మాతల పేర్లు



కూడా తెరపైకి వచ్చాయి, ఈ ప్రచారం కాస్తా వైరల్ కావడంతో అభిమానుల్లో అయోమయం నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, మారుతి తదుపరి సినిమా గురించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలన్నీ కేవలం పుకార్లు మాత్రమే, అవి పూర్తిగా నిరాధారమైనవని, అందులో ఎటువంటి వాస్తవం లేదని ఆయన పీఆర్ టీమ్ ప్రకటించింది, కేవలం క్లిక్ బైట్స్ కోసం లేదా అంచనాల కోసం సృష్టించిన వార్తలుగా వీటిని పరిగణించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. మారుతి తన ప్రతి ప్రాజెక్టును చాలా ప్లాన్డ్‌గా అనౌన్స్ చేస్తుంటారు, ఒకవేళ తన తదుపరి సినిమా ఖరారైతే, ఆ వివరాలను ఆయన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా, సంబంధిత నిర్మాణ సంస్థల అధికారిక ప్రకటనల ద్వారా వెల్లడిస్తారు అని పేర్కొన్నారు. అనధికారిక మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని షేర్ చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని మారుతి సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఆలోచింప చేసే అద్భుత సినిమా దండోరా



సినిమాను చూసి మెచ్చుకున్న ఎన్టీఆర్

**టాకీస్:** తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇది ఎంతో లోతైన, శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే చిత్రం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవిలు తమ నటనతో సినిమా ఆద్యంతం అద్భుతంగా రాణించారు. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఇలాంటి గొప్ప ప్రయత్నాన్ని ప్రోత్సహించి, నిర్మించిన రవీంద్ర బెనర్జీ గారికి అభినందనలు. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకొచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్-2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.

## రెండోసారి తండ్రి కాబోతున్న డైరెక్టర్ అట్లీ..

టాకీస్: కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ, ఆయన భార్య ప్రియ తాము రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. మా ఇంట్లోకి మరో చిన్నారి రాకతో మా సంతోషం రెట్టింపు కాబోతోంది. అవును, మేము రెండోసారి తల్లిదండ్రులం కాబోతున్నాం! మీ దీవెనలు ఎల్లప్పుడూ మాపై ఉండాలని కోరుకుంటున్నాం. ప్రేమతో? అట్లీ, ప్రియ, మీర్, బెక్కీ, యుకీ, చోకీ, కాఫీ మరియు గూఫీ. అంటూ అట్లీ ఎక్స్ వేదికగా రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. 2014లో వివాహం చేసుకున్న ఈ జంటకు ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత 2023 జనవరిలో



మొదటి సంతానంగా కుమారుడు మీర్ జన్మించాడు. ఇప్పుడు రెండేళ్ల విరామం తర్వాత మళ్ళీ తల్లిదండ్రులం కాబోతున్నట్లు ప్రకటించారు.

## ప్రభాస్ సలార్ 2
# టీజర్ వచ్చేస్తుంది..

**టాకీస్:** రీసెంట్‌గా మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు గ్లోబల్ స్టార్ ప్రభాస్. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ రెస్పాన్స్‌తో స్క్రీనింగ్ అవుతోంది. ప్రభాస్ లైనప్‌లో క్రేజీ సినిమాలున్నాయని తెలిసిందే. వీటిలో ఒకటి సలార్ ఫ్రాంఛైజీ. కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో యాక్షన్ థ్రిల్లర్ ఫ్రాంఛైజీలో రాబోతున్న సీక్వెల్ ప్రాజెక్ట్ సలార్ 2. సీక్వెల్‌ను హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై విజయ్ కిరంగదూర్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. కాగా అభిమానులు, మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియా మోస్ట్ ఎవెయిటెడ్ సీక్వెల్ సలార్ 2 టీజర్ కు టైం ఫిక్సయిందా?? అంటే నెట్టింట రౌండప్ చేస్తున్న తాజా కథనాలు అవుననే హింట్ ఇచ్చేస్తున్నాయి.

తాజా టాక్ ప్రకారం సలార్ 2టీజర్ జనవరి 25న విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారట మేకర్స్. ప్రస్తుతానికి ఇది అధికారిక వార్త ఏం కాకున్నా అభిమానులు మాత్రం ఈ అప్‌డేట్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. సలార్ 2లో



శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. శ్రియారెడ్డి, టిన్ను ఆనంద్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మాలీవుడ్ యాక్టర్ షైన్ టామ్ చాకో కీలక పాత్రలో నటిస్తున్నాడని వార్తలు రౌండప్ చేస్తుండగా.. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.